# పైమెట్టు

**—ఈశ్వరి**

మూడు, ఐదు, ఏడు, ఎనిమిది, తొమ్మిది అంకెలతో కుస్తీ పడుతున్నది శైలజ. ఆరోజు ఫస్టుతారీకు. జీతాలొచ్చేరోజు. ఖర్చులన్నీ ఒక కాగితం మీద వేసి కూడుతున్నది. వచ్చిన మొత్తం చూడగానే గుండె గుభేలుమంది. మళ్లీ కొన్ని అయిటమ్స్ తగ్గిద్దామని ప్రయత్నించింది. దేన్ని తగ్గించాలి?

ఇంటి అద్దె, పాలు, బియ్యం, వెచ్చాలు, పిల్లల ఫీజులు... అన్నీ ముఖ్యమైనవే. పోనీ వేటికైనా క్వాంటిటీ తగ్గించి అంకెలు తక్కువ చేద్దామంటే ఊహూ... కుదరదు. ఇప్పటికే చాలా పొదుపుగా వాడుతున్నది. ఇంకా తగ్గిస్తే పిల్లలకి కనీస పోషకాహారం కూడా ఇవ్వలేదు. తప్పదు. ఆ ఖర్చులన్నీ వుండాల్సిందే. మరి భర్తకొచ్చే జీతం?

తను వేసే టోటల్‌కంటే ఒకటో, అరో వందలు తక్కువే. కానీ పైసా కూడా ఎక్కువ రాదు. ఎలా అనుకుంటూ అంకెలతో అలసిపోయిన ఆమె తాత్కాలికంగా బడ్జెట్‌ను పక్కకుపెట్టి కుర్చీలో వెనక్కువాలి కళ్లు మూసుకుంది.

కళ్లనైతే మూసుకుందిగానీ మనసులో ఆలోచనలను ఏం చేస్తుంది? అది తన పనిని తను చేసుకుంటూ లెక్కలు వేస్తూనేవుంది. బాబుకి స్కూలు యూనిఫాం నిక్కర్లు వెలిసి పోయాయి. పాపం వాటినే తొడుక్కుంటున్నాడు. తను ప్రతినెలా కొత్తవి కొందాం అనుకుంటూ ప్రతినెల బడ్జెట్ చూసి భయపడి పోస్ట్‌పోన్ చేస్తున్నది. ఇంక బూట్లు కూడా చిరిగిపోయి కుట్లతో అసహ్యంగా ఉన్నా వాటిని మార్చలేక వాటికే పాలిష్ చేసి బాబును సముదాయించి పంపుతున్నది. ఇంక ఈనెలలో పాప పుట్టినరోజు. ఎంత చౌకలో కొందామన్నా కనీసం యాభై రూపాలన్నా లేనిదే గౌను రాదు. పిల్లలకు బర్త్‌డేరోజు స్కూలులో చాక్లెట్స్ పంచాలన్న కోరిక. అందుకోసం ఎంత తక్కువగా వేసుకున్నా ఇరవై రూపాయలన్నా ఖర్చవుతుంది.

ఆలోచిస్తున్న శైలజ బర్...మంటూ కారు మోతకు కళ్లు తెరిచి కిటికీలోంచి బయటకు చూసింది. ఎదురింటి సులోచనగారు కారులో బయటకు పోతున్నారు. బహుశా మహిళామండలికేమో? ఆమెకేం.. అదృష్టవంతురాలు. పెద్ద బంగళా, లక్షల ఆదాయాన్నిచ్చే బిజినెస్, పెద్ద చదువులు చదువుతున్న కొడుకులు. తనలా మొదటి తారీకు బడ్జెట్ వేసుకోవడం, దేనికి సర్దుకోవాలి? ఏ ఐటమ్ కొట్టి వేయాలి? డబ్బు ఎట్లా సరిపెట్టుకోవాలి? అన్న చింతే వుండదు అనుకుంది. ఫ్యామిలీ బడ్జెట్ ఆలోచనల నుంచి మనసు మళ్లించడం కోసం రేడియో ఆన్ చేసింది.

''రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఎలు పెంచారు. నవంబర్ నుండి ఒకటి, జనవరి నుండి ఒకటి ఇవ్వడానికి ఆర్థికమంత్రి అంగీకరించారు. దానివల్ల ప్రభుత్వానికి అదనంగా ఇరవై కోట్లు భారం'' వార్తలు చెబుతున్నాడు న్యూస్ రీడర్.

'హమ్మయ్య! కొంత జీతం పెరిగిందన్నమాట. పోనీలే. కొంత సరిపెట్టుకోవచ్చు' అని సంతోషపడింది శైలజ. వెలిగిపోతున్న మొహంతో వార్తల్ని మరింత శ్రద్ధగా వినడం మొదలుపెట్టింది. ''రేపటి నుండి పాల ధరను ప్రభుత్వం పెంచుతున్నది'' న్యూస్‌రీడర్ వార్త విన్న శైలజ మొహం గుప్పున ఆరిపోయిన ట్యూబ్‌లైట్ అయింది. విసుగ్గా రేడియో కట్టేసింది.

ఆమెలా ఎంతమంది మధ్య తరగతి గృహిణులు ఫస్టుతారీకున బడ్జెట్ వేసుకుంటూ డెఫిసిట్ రాకుండా చూసుకోవాలని కుస్తీ పడుతున్నారో ఈ స్వతంత్ర భారతదేశంలో?

★ ★ ★

కారు సరాసరి మహిళామండలి కాంపౌండ్‌లో ఆగింది. అందులోంచి దిగిన సులోచన సుతారంగా కూలింగ్ గ్లాసెస్‌ని మునివేలితో పైకి తోసుకుని ''హాయ్'' అంటూ పలుకరించింది. ఎదురుగా కనిపించిన మధుమతిని ''హలో... రారా... మనవాళ్లంతా లోపల సమావేశమై వున్నారు. నీ కోసమే చూస్తున్నాం'' అంటూ లోపలికి దారి తీసింది మధుమతి. పట్టుచీర అంచు సరిచేసుకుంటూ అనుసరించింది సులోచన.

హాల్లో అంతా పది పదిహేనుమంది ఆడవాళ్లు కూర్చుని వున్నారు. ముప్పయి అయిదు నుండి యాభై ఐదు సంవత్సరాల మధ్య వయసువాళ్లు. కానీ వాళ్ల ముస్తాబు మాత్రం పాతికేళ్ల పిల్లల్లా వుంది. వాళ్లను చూడగానే అంతా పై తరగతికి చెందినవాళ్లేనని చెప్పకనే తెలుస్తోంది. కొందరు ఉన్నతోద్యోగుల భార్యలైతే మరికొందరు బిజినెస్ మాగ్నట్స్ భార్యలు. వంటకు వంటమనిషి, పనికి పనిమనిషి, పిల్లల చదువులకు ట్యూషన్‌మాస్టర్లున్న వీళ్లు ఇంట్లో చేయడానికి పనిలేక సంఘసేవ, మహిళా ఉద్ధరణ కార్యక్రమాలు చేపట్టి మహిళామండలి స్థాపించారు.

దాని తరపున ఓ లైబ్రరీ, కుట్లు నేర్పే సెంటరు. వీళ్లల్లో ఏ ఒక్కరికి లైబ్రరీలో ఎన్ని పుస్తకాలు వున్నాయో తెలియదు. కనీసం రోజూ పేపర్ తిరగేసే అలవాటు కూడా లేదు. పెరిగే ధరలు, సామాన్య మానవుడు పడే బాధలు వాళ్లకు అసలే తెలీదు. మహిళామండలి తరపున అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాల్ని మాత్రం చేపడుతుంటారు. వాటికి అధ్యక్షులుగా పెద్ద పెద్దవాళ్లని పిలుస్తారు. వాళ్లని సన్మానించి ఏ కూతులో, మేనకోడలో వ్రాసిచ్చిన ఉపన్యాసం చదవడంతో కార్యక్రమం ముగుస్తుంది.

ఈ కార్యక్రమానికి కావాల్సిన డబ్బు, విరాళాలు పోగు చేస్తారు. సంఘసేవ చేస్తూ బయట అనేక కార్యక్రమాలు చేపట్టి తమకు, ఇంట్లో కూర్చుని బయట ప్రపంచం పట్టించుకోని మధ్య తరగతి స్త్రీలు, తమ తోటివారికోసం, సంఘం కోసం ఆ మాత్రం విరాళాలు ఇవ్వలేరా?

పెద్ద బిజినెస్ మాగ్నట్ భార్య కారు దిగి వచ్చి ఏనాడూకూడా తనకంటే తక్కువ అంతస్తుగల వాళ్లింటిలో కాలుపెట్టని ఆమే స్వయంగా వస్తే కారు చూసైనా విరాళాలు ఇవ్వరా?

పెద్ద ఆఫీసర్‌గారి భార్య చుట్టుప్రక్కలగల మధ్యతరగతి స్త్రీల దగ్గరకు వెళ్లివారికోసం మేం శ్రమిస్తున్నాం అంటే ఆమె పట్టు చీర చూసైనా చందా ఇవ్వరా? ఫాల్స్ ప్రస్టేజీకి పోయే మధ్య తరగతి వాళ్లనుండి విరాళాలు పోగు చేయడం తేలిక. అందుకే విరాళాలు పోగు చేయాలి అన్న ఆలోచన వచ్చిందంటే కార్యక్రమం సగం సక్సెస్ అయినట్టే.

ఆరోజు మీటింగ్‌లో చర్చనీయాంశం- కుట్లు సెంటర్‌లో పాత మిషన్లు, పాడైపోయిన వాటికి బదులు కొత్తవి కొనడం, చుక్కలనంటుతున్న ధరలతోపాటు

పెరిగిపోయే టైలరింగ్ చార్జీలు ఇచ్చుకోలేని క్రింది మధ్య తరగతి స్త్రీలు అక్కడకొచ్చి టైలరింగ్ నేర్చుకుంటారు. ఉన్నవి పనిచేయని కారణంగా కొత్తవాటి అవసరం వచ్చింది. అందుకే ఒక చిన్న ఎంటర్‌టైన్‌మెంట్. దానికి టిక్కెట్లు. టిక్కెట్లుకు ధరలేదు. ఇచ్చేవాళ్లనుబట్టి. డబ్బు ఊరికే తీసుకోవడంలేదు. దాతలకు కనువిందైన ప్రోగ్రాం 'బుచ్చయ్యగారి అల్లుడు'. దానిలో నటులంతా మహిళామండలి సభ్యురాళ్లే. ప్రోగ్రాం డేట్ ఫిక్స్ చేసుకుని కూల్‌డ్రింక్స్ త్రాగుతూ కబుర్లలో పడ్డారు జట్లు జట్లుగా. ఫలానమ్మ కూతురి ప్రేమ వివాహం తాలూకు గుసగుసలు, డైమండ్ టాప్స్ చేయించుకున్న వైనం, ఎవరు ఎంత ఆస్తి సమకూర్చు కున్నారు, వీటితో తృప్తిపడి ఆ మీటింగ్ అంతటితో ముగించేసారు.

★ ★ ★



ఉదయం పదకొండు గంటలు కావస్తున్నది. అప్పటిదాకా హడావుడిగా పనితో అలిసిన శైలజ నిదానంగా ఇల్లంతా సర్ది ఓ కప్పు కాఫీ తాగి కూనిరాగం తీస్తూ దొడ్లో బట్టలు వుతుకుతోంది.

తలుపు తట్టిన శబ్దం. ''వస్తున్నా'' చేతికున్న సబ్బును కడిగి చెంగుకు చేతులు తుడుచుకుంటూ తలుపు తీసింది ఎదురింటి సులోచనగారు.

''ఏమ్మా బాగున్నావా?'' చిరునవ్వుతో అడిగింది సులోచన.

''ఆ...'' ఆమె ప్రశ్నతో ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చింది అవాక్కయిన శైలజ. ఎప్పుడూ పొరపాటున కూడా ఎదురింటివైపు తలతిప్పి చూడని ఆమె సరాసరి ఇంటికొచ్చేసరికి ఆశ్చర్యంతో శిలే అయింది శైలజ.

''లోపలకు రానా?'' నవ్వుతూ అడిగింది ఆమె.

''రండి...రండి'' గాబరాతో కూడిన మర్యాదతో లోపలికి ఆహ్వానించింది. ఆవిడ లోపలకు వచ్చి కుర్చీలో కూర్చుంది. ఆమె ఎందుకు వచ్చిందో అర్థంకాని శైలజ మనస్సంతా ప్రశ్నల మయమయింది.

''చూడమ్మాయ్! నువ్వు నాకంటే చిన్నదానివి. అమ్మాయి అంటున్నా ఏమనుకోవుగా?'' శైలజ చిన్నతనం ఫీలవకుండా తన మాటకారితనం జోడించింది.

''అబ్బే పర్వాలేదు. పెద్దవారు మీరు'' నీళ్ళు నమిలింది శైలజ.

''చూడమ్మాయ్! మనతోటి స్త్రీలకు సేవ చేయాలనే తపనతో మేము మహిళామండలి పెట్టాము. అందులో చేరమంటే నువ్వు చేరలేదుగా?'' నిష్ఠూరంగా అంది సులోచన తప్పంతా శైలజదే అన్నట్లు.

ఆ మాటకు బిత్తరపోయింది శైలజ. ఆమె తనను అడిగిందెప్పుడు? తాను కాదన్నదెప్పుడు?

కానీమర్యాదకు''నాకుకుదరదండీ''నసిగింది.

''నాకుతెలుసమ్మా. అందుకే మేము ఆ భారాన్ని మానెత్తినవేసుకున్నాము'' అంది సమాజభారాన్ని మోసే సేవకురాలిగా.

''మనతోటి స్త్రీలు కుట్లు నేర్చుకోవాలంటే మన కుట్టుసెంటరులో మిషన్లు ఎక్కువ లేవమ్మా. నేర్చుకోవాలని చాలామంది వస్తున్నారు. అందుకే కొత్త మిషన్లు కొనాలని మా తాపత్రయం. వాటికోసం విరాళాలు పోగుచేస్తున్నాం. ఊరికే ఇవ్వక్కర్లేదు. మేం ఓ మంచి ప్రోగ్రాం చూపిస్తాము. ఇదిగో టిక్కెట్టు'' అంటూ పుస్తకంలోంచి ఓ టిక్కెట్టు చించి శైలజ చేతిలోపెట్టింది.

''నీ పేరేమిటమ్మా?'' యాభై రూపాయల టికెట్టు ఒకటి ఇస్తూ ''చాలా?'' ప్రశ్నించింది సులోచన.

''అమ్మో'' ఉలిక్కిపడింది శైలజ. టిక్కెట్టు యాభైనా? చేతిలో టిక్కెట్టు బరువనిపించింది.

''ఆయన వచ్చిన తరువాత అడిగి తీసుకుంటాను. ఇప్పుడొద్దులెండి'' అంటూ నీళ్ల నములుతూ మొహమాటంగా టిక్కెట్టు తిరిగి ఇవ్వబోయింది.

''భలేదానివమ్మా. ఇలాంటి చిన్న విషయాలకు కూడా మగవాళ్లనడగాలా? పక్కింటి వనజ, శారద వాళ్లంతా ఇచ్చిన వెంటనే తీసేసుకున్నాను. ఇలాంటిచిన్నచిన్న ఖర్చులు పెట్టుకునే స్వాతంత్ర్యం మనకు లేదా ఏమిటి? ప్రతీదీ మగవాళ్లని అడిగి చేస్తే వాళ్లకి మరీ లోకువ అవమా? కాస్త స్వతంత్రంగా ఆలోచించడం నేర్చుకోమ్మా? బయటకు వస్తే ఇలాంటివి తెలుస్తాయి. లేకపోతే నూతిలో కప్పలా వుండిపోతావు. జాగ్రత్తమ్మా. డబ్బుకు రేపు మా పనిమనిషిని పంపుతాను. ఇవ్వు'' అంటూ హితబోధ చేసి వెడుతున్న సులోచనను చూస్తూ నిశ్చేష్టురాలయింది శైలజ. తేరుకునేసరికి మెల్లగా రకరకాల ఆలోచనలు ఆమెను ఒక్కసారి చుట్టుముట్టాయి. తన కుటుంబ బడ్జెట్‌కు సరిపోక డబ్బు అవస్థ పడుతుంటే ఎదురింటావిడ మహిళామండలి టిక్కెట్టు ఆమెను వెక్కిరించినట్టయింది.

కానీ అంతలోనే అంత గొప్ప హోదా వున్నావిడ కంటే ఆమెకి చందా ఇచ్చే తాను మరో మెట్టు పైన వున్నట్టు ఫీలయింది శైలజ.

★